సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 18 । జనవరి । 2025



ఉత్సాహంగా తెప్పల పోటీలు

వేములవాడఅర్బన్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లో శుక్రవారం నిర్వహించిన తెప్పల పోటీలు ఉత్సాహంగా సాగాయి. దాదాపు ఏడు గ్రామాలకు చెందిన ముదిరాజ్ మత్స్యకారులు మిడ్‌మానేటిలో తెప్పల పోటీల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ పోటీలు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. విజేతలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బహుమతులు అందించారు.

- వివరాలు IIలో ▸

న్యూస్‌రీల్

పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలి

● ఎస్పీ అఖిల్‌మహాజన్



ఎల్లారెడ్డిపేటలో తనిఖీ చేస్తున్న ఎస్పీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కేసుల దర్యాప్తు పకడ్బందీగా చేపట్టాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. ఎల్లారెడ్డిపేట ఠాణాను శుక్రవారం సందర్శించారు. ఠాణాలో నమోదైన కేసులు, రికార్డులు తనిఖీ చేశారు. ఫిర్యాదులపై జాప్యం చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్, 100 డయల్ సిబ్బంది వెంటనే స్పందించాలని సూచించారు. పెట్రోలింగ్ సమయంలో రౌడీషీటర్లపై దృష్టి పెట్టాలన్నారు. స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు పోలీసుల పనితీరును ఠాణాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలియజేయాలని కోరారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్ ఉన్నారు.

వ్యవసాయ యోగ్యంకాని భూములు గుర్తించాలి

● అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



సింగారంలో భూములు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట(సిరిసిల్ల): రైతు భరోసా పథకానికి అర్హులను గుర్తించాలని, వ్యవసాయ యోగ్యంకాని భూములు గుర్తించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం, ముస్తాబాద్ మండలం మద్దికుంటలో రైతుభరోసా కోసం సర్వే శుక్రవారం కొనసాగుతుండగా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ పథకాల అమలు కోసం కొనసాగుతున్న సర్వేపై ఆరా తీశారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, ఉద్యానవన అధికారి లత, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ తహసీల్దార్లు రాంచంద్రం, సురేష్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలపై దాడులు కక్షపూరితమే..

● బీఆర్‌ఎస్ నేత చల్మెడ లక్ష్మీనర్సింహారావు



వేములవాడ: ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టి కూడా వారిపై దాడులు చేయడం ఏంటని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రశ్నించారు. వేములవాడలోని తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణులు తక్షణ వైద్యసేవలకు ఆర్‌ఎంపీలనే ఆశ్రయిస్తారని, అలాంటి వారిపై రెండు రోజులుగా దాడులు చేస్తుండడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ లేని ఈ దాడులు, రాజన్నసిరిసిల్లలోనే ఎందుకని అడిగారు. ఆర్‌ఎంపీలపై ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులు వచ్చాయ.. అని ప్రశ్నించారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలను లక్ష్యంగా దాడులు చేయడాన్ని ఖండించారు. వారికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు, లైసెన్స్‌లు మంజూరుచేసి వారితో పల్లె ప్రజలకు సేవలందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏనుగు మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, క్రాంతికుమార్, ప్రభాకర్‌రావు ఉన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి



సిరిసిల్లటౌన్: సంగారెడ్డి జిల్లాలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించే రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు కోరారు. ఈమేరకు శుక్రవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చేయాల్సిన పోరాటాలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. నాయకులు మూశం రమేశ్, కోడం రమణ, ఎర్రవెల్లి నాగరాజు, సూరం పద్మ, గణేష్, శ్రీరాములు రమేశ్‌చంద్ర, పోచమల్లు పాల్గొన్నారు.

సాగు చేస్తున్నారా..

● పంటపొలాల్లోకి అధికారులు
● క్షేత్రస్థాయి సర్వేలతో రైతుభరోసా
● వ్యవసాయేతర భూముల గుర్తింపు

జిల్లాలో భూములు ఇలా..

రెవెన్యూ గ్రామాలు	171
రెవెన్యూ సర్వే నంబర్‌లు	91,416
భూములు	4,68,532 ఎకరాలు
వ్యవసాయ యోగ్యమైన భూములు	2.40 లక్షల ఎకరాలు
యాసంగిలో సాగయ్యే భూమి	1,53,022 ఎకరాలు



ఇది తంగళ్లపల్లి మండలం పాపయ్యపల్లి. ఇక్కడ రైతులు తమ పంట భూముల్లోనే ఇళ్లు నిర్మించుకున్నారు. పట్టాదార్ పాస్‌పుస్తకంలో వ్యవసాయభూమిగా నమోదు కాగా.. ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. పక్కనే వ్యవసాయ భూమి కూడా ఉంది. ఏమేరకు వ్యవసాయ భూమి ఉంది. ఏమేరకు నివాసం ఉంటున్నారనే విషయాన్ని అంక్షాంశ, రేఖాంశాల ఆధారంగా సర్వేచేస్తున్నారు.

సిరిసిల్ల: సాగుభూములకే పెట్టుబడి సాయం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో సాగు భూముల సర్వే మొదలైంది. జిల్లాలోని అధికారులు పొలంబాట పట్టారు. సర్వే నంబర్ల వారీగా పంటలు సాగుచేస్తున్నారా.. లేదా.. అనే వివరాలు సేకరిస్తున్నారు. గతంలో రైతుబంధు ఎకరాకు ఏటా రూ.10వేల చొప్పున బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించగా.. రైతుబంధు స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాగా ఎకరాకు రూ.12వేల చొప్పున అందించాలని భావిస్తోంది. గతంలో బీడుభూములకు, నాలా కన్వర్షన్, భూసేకరణ పూర్తయిన వాటికి, సాగుకు యోగ్యంగా లేని గుట్టలకు, బంజరుభూములకు రైతుబంధు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజాధనాన్ని వృథా చేయకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం సాగుభూముల సర్వే చేపట్టింది. వ్యవసాయ, రెవెన్యూ, ఎంపీడీవో అధికారులు క్షేత్రస్థాయి సర్వేలు చేస్తున్నారు.

ఈ భూములకు రైతుభరోసా రాదు

ధరణిలో వ్యవసాయభూమిగా నమోదైతే రైతుబంధు సాయం అందేది. కానీ ఈసారి ధరణితో సంబంధం లేకుండా రైతుభరోసా జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇందులో పరిశ్రమలు నెలకొల్పిన భూములను, రైస్‌మిల్లులు, కోళ్లఫారాలు, పెట్రోల్‌బంక్‌లు, టెక్స్‌టైల్, అపెరల్‌పార్క్, ఆహారశుద్ధి పరిశ్రమలు, వ్యవసాయేతర భూములు(నాలా)గా నమోదైన అన్ని రకాల భూములు, ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించిన రియల్ ఎస్టేట్ వెంచర్ల భూముల వివరాలు రైతుభరోసా జాబితా నుంచి తొలగించనున్నారు.

గ్రామసభల్లో వివరాలు వెల్లడి

రైతుభరోసా చెల్లింపుల్లో పారదర్శకత ఉండాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయి సర్వేలో సేకరించిన వివరాలను ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో వెల్లడిస్తారు. అర్హత గల రైతుల వివరాలను ప్రకటించి జనవరి 26 నుంచి రైతుభరోసా అందించాలని భావిస్తున్నారు. గ్రామసభల్లో వచ్చిన అభ్యంతరాలను అధికారులు పరిశీలించి పరిష్కరించాల్సి ఉంటుంది. మొత్తంగా రైతుభరోసా కోసం ప్రభుత్వం చేపట్టిన సాగుయోగ్యమైన భూముల సర్వేలో గ్రామసభలు ఎంతో కీలకం కానున్నాయి.

సర్వేనంబర్లు, రైతులు ఇలా..

మండలం	సర్వేనంబర్లు	రైతులు
సిరిసిల్ల	2,565	3,287
తంగళ్లపల్లి	9,107	10,387
గంభీరావుపేట	9,423	9,691
ముస్తాబాద్	9,633	11,192
ఎల్లారెడ్డిపేట	11,753	9,782
వీర్నపల్లి	1,148	3,018
వేములవాడఅర్బన్	4,950	5,039
వేములవాడరూరల్	6,081	6,415
బోయినపల్లి	8,692	9,013
కోనరావుపేట	8,539	9,867
చందుర్తి	6,367	8,110
రుద్రంగి	1,247	2,751
మొత్తం	91,416	1,03,140

అధికారుల బృందం సర్వే చేస్తుంది



జిల్లాలో గురువారం నుంచే వ్యవసాయ భూముల సర్వే సాగుతోంది. వ్యవసాయాధికారులతోపాటు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సర్వేలో ఉన్నారు. జిల్లాలో 51 మంది ఏఈవోలు, 13 మంది ఎంఏవోలు భాగస్వాములయ్యారు. జనవరి 20 వరకు క్షేత్రస్థాయి సర్వే పూర్తవుతుంది. జిల్లాలో గుర్తించిన సాగుకు యోగ్యమైన భూముల వివరాలను గ్రామసభల్లో వెల్లడిస్తారు. క్షేత్రస్థాయిలో సాగుతున్న సర్వేను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– అఫ్జల్ బేగం, జిల్లా వ్యవసాయాధికారి

మహనీయుల స్ఫూర్తితో ముందుకుసాగాలి



చందుర్తిలో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● రూ.700కోట్లతో అభివృద్ధి
● 26న రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు
● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు మహనీయుల స్ఫూర్తితో ముందుకుసాగాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. చందుర్తి మండల కేంద్రంలో మహాత్మాజ్యోతిరావుపూలే, సావిత్రి బాయిపూలే, బుద్ధుని విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించి, సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మహనీయుల చరిత్ర తెలుసుకొని, వారి అడుగుజాడల్లో పయణించాలని కోరారు. బీఆర్‌ఎస్ పదేళ్లలో చేయలేని మల్రెపల్లి, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, సనుగులలోని కాల్వపనులు, లచ్చపేట రిజర్వాయర్ పనులు చకచక సాగుతున్నాయన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, చందుర్తి, కోనరావుపేట, వేములవాడరూరల్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, షేక్ ఫిరోజ్‌పాషా, వకుళాభరణం శ్రీనివాస్, రుద్రంగి, కోనరావుపేట, వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు తిరుపతి, ఎల్లయ్య, రొండి రాజు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ ప్రారంభం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ఓల్డ్ అర్బన్‌కాలనీలోని కమ్యూనిటీహాల్‌ను విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి ప్రారంభించారు. ముంపు గ్రామాల ప్రజలకు రూ.238కోట్లతో 4,696 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. వార్డు కౌన్సిలర్ సిరిగిరి చందు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కమిషనర్ అన్వేశ్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, మారం కుమార్ ఉన్నారు.

అన్నదానం గొప్పది

అన్నింకంటే అన్నదానం గొప్పదని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక శ్రీపార్వతీ రాజరాజేశ్వర శివదీక్ష సేవా సమితి ట్రస్ట్ అదనపు భవనాలను ప్రారంభించి మాట్లాడారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా అదనపు భవనం నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, కనికరపు రాకేశ్, రాపెల్లి శ్రీధర్ ఉన్నారు.

రోగులకు మందులు అందించాలి

● మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ
● ఈ–ఔషధిపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

సిరిసిల్ల: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో మందులు అందించాలని సిరిసిల్ల మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మీనారాయణ సూచించారు. సిరిసిల్ల జిల్లా జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం ఈ–ఔషధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రోగులకు మందులపై పూర్తి నమ్మకాన్ని కలిగించాలన్నారు. ఈ–ఔషధిపై సిబ్బంది అవగాహనతో ఉండాలన్నారు. డీఎంహెచ్‌వో రజిత, జిల్లా జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు లక్ష్మీనారాయణ, డీసీహెచ్‌ఎస్, వేములవాడ ఆస్పత్రి పర్యవేక్షకులు పి.పెంచలయ్య, ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.నాగార్జున చక్రవర్తి, ఎస్.సుగుణ శోభారాణి, ఆవాస్ మారి, ఆస్పత్రి ఆర్‌ఎంవో కాశీనాథ్, ఆస్పత్రి అదనపు పర్యవేక్షకులు డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనకు ‘ఖాకీ కిడ్స్’



సిరిసిల్ల: జిల్లా పోలీసులు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సైబర్ నేరాల నియంత్రణ లక్ష్యంగా విద్యార్థి దశ నుంచి సైబర్‌నేరాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ‘ఖాకీ కిడ్స్’ అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆలోచనలతో సైబర్ నేరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ‘ఖాకీ కిడ్స్’ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ మేరకు పిల్లలకు చదువుతోపాటు సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించనున్నారు. జిల్లా పోలీస్ ఆఫీస్ ఆవరణలో శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించనున్నారు.

ఇసుక కొరత లేకుండా చూడాలి



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో అభివృద్ధి పనులకు ఇసుక కొరత లేకుండా చూడాలని, నిబంధనలు అనుసరించి రవాణా సాగేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ముస్తాబాద్ మండలం కొండాపూర్ వద్ద రెండు రీచ్‌లు, ఎల్లారెడ్డిపేట మండలం పదిర, సిరిసిల్ల మండలం సర్దాపూర్, తంగళ్లపల్లి మండలం చింతలపల్లి, మండెపల్లి వద్ద ఒక్కో రీచ్‌లు ఉన్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్యాకేజీ 17 కెనాల్ లైనింగ్ పనులకు 35 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను సిరిసిల్ల మండలం పెద్దూరు, తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లోని చెక్‌డ్యాం ముంపు ప్రాంతం నుంచి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని సూచించారు. జిల్లాలో నూతనంగా నిర్మించే ప్రభుత్వ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి ఎక్కడ ఇసుక కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్ వద్ద ఇసుకరీచ్ ఏర్పాటుపై ఇసుక కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు సంయుక్తంగా పరిశీలించి రెండు, మూడు రోజుల్లో నివేదిక అందించాలని తెలిపారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతికుమార్, ఈఆర్డీవో శేషాద్రి, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్‌రెడ్డి, సర్వే ఏడీ వినయ్‌కుమార్, మిషన్ భగీరథ ఈఈ జానకీ, సిరిసిల్ల తహసీల్దార్ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఇల్లంతకుంట(మానకొండూర్): అర్హుల గుర్తింపు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతారం, జంగారెడ్డిపల్లి, ఇల్లంతకుంట గ్రామాల్లోని సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రేషన్ కార్డు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. అనంతారంలో వొల్లాల రాజు పొలంలోకి వెళ్లి సాగులో ఉన్నట్లు ధ్రువీకరించారు. మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ ఫరూక్, ఎంపీడీవో శశికళ, మండల ఏవో సురేశ్‌రెడ్డి, కార్యదర్శులు వరుణ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పల్లె దవాఖానా పరిశీలన

ఇల్లంతకుంటలోని పల్లె దవాఖానాను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. పల్లె దవాఖానాలో అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోకు సూచించారు. జిల్లా వైద్యాధికారి రజిత, ఎంపీడీవో శశికళ, ఇల్లంతకుంట పీహెచ్‌సీ వైద్యులు శరణ్య, జీవనజ్యోతి, హెచ్‌ఈవో వెంకటరమణ పాల్గొన్నారు.

సర్కారు భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సిరిసిల్లటౌన్: జిల్లాలో ప్రభుత్వ భూములు ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయి.. అనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. తంగళ్లపల్లి మండలంలో 7వేల ఎకరాలు ప్రభుత్వ భూములు ఉండగా 1,500 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. దొంగ పాస్‌బుక్కులు సృష్టించిన అప్పటి రెవెన్యూ అధికారుల ఆస్తులపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సోమ నాగరాజు, అజ్జ వేణు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు తగ్గించాలి

● జిల్లా వైద్యాధికారి రజిత



సిరిసిల్ల: మాతా, శిశుమరణాలు వంద శాతం తగ్గించాలని జిల్లా వైద్యాధికారి రజిత అన్నారు. సిరిసిల్ల శివారులోని రగుడు ఐఎంఏ భవన్‌లో శుక్రవారం జిల్లాలోని పీహెచ్‌సీల్లోని ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. గర్భిణీ ఆరోగ్య వివరాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. అప్పుడే మాతా, శిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. వైద్యులు అంజలినా ఆల్ఫ్రెడ్, అఖిల, సౌజన్య, చేతన్, కార్తీక్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి/ఇల్లంతకుంట: తంగళ్లపల్లి మండలం నేరేళ్ల, ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లోని పీహెచ్‌సీలను డీఎంహెచ్‌వో రజిత తనిఖీ చేశారు. వైద్యులు జిందం రేఖ, శరణ్య, ప్రేమ్‌కుమార్, రమణ ప్రసాద్, రాజ్‌కుమార్ ఉన్నారు.

డబుల్ రోడ్డు కోసం పాదయాత్ర



మహాపాదయాత్ర చేస్తున్న కొత్తపల్లి నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): కొత్తపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి రాజుపేట శివారు వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయా గ్రామాల నాయకులు శుక్రవారం మహాపాదయాత్ర చేపట్టారు. రాజుపేట నుంచి కొత్తపల్లి, లింగన్నపేట మీదుగా గంభీరావుపేటలోని రెవెన్యూ కార్యాలయం వరకు పాదయాత్రగా వచ్చి తహసీల్ ఆఫీస్‌లో వినతిపత్రం అందించారు. ఇటు కొత్తపల్లి ఎల్లమ్మ గుడి, అటు రాజుపేట శివారు వరకు డబుల్ రోడ్డు ఉందని.. మధ్యలో మూడు కిలోమీటర్లు నిర్మించాలని కోరారు. గ్రామానికి చెందిన నాయకులు గౌటి గణేష్, అల్లె సత్యం, పెద్దూరి పర్శరాంగౌడ్, శ్రావణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిపోయి.. తుప్పుపట్టి

● పాడయిన ఓపెన్ జిమ్ పరికరాలు
● ప్రజలకు ఉపయోగపడని వైనం
● నిర్వహణలోపంపై విమర్శలు

సిరిసిల్లటౌన్: ఓపెన్‌జిమ్‌లలోని పరికరాలు తుప్పుపట్టి.. విరిగిపోయి అధ్వానంగా మారాయి. సిరిసిల్ల పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో రూ.1.75కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్స్ వినియోగంలోకి రావడం లేదు. ఒక్క పరికరం సరిగ్గా లేక ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారు వ్యాయామం చేయలేకపోతున్నారు. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో 23 ప్రాంతాల్లో ఓపెన్‌జిమ్స్ ఏర్పాటు చేశారు. అధికారుల పట్టింపు లేక.. పరికరాలను కాపాడుకోవాలన్న బాధ్యత ప్రజల్లో లేకపోవడంతో శిథిలమవుతున్నాయి.



మీరు చూస్తున్న ఈ ఫొటో జిల్లా కేంద్రం శాంతినగర్‌లోని స్మార్ట్ ఓపెన్‌జిమ్. ఇది రూ.15లక్షలతో ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత ప్రజలు నిత్యం ఇక్కడకు వచ్చి ఆరోగ్యం కోసం ఓపెన్‌జిమ్‌లో పరికరాలతో కసరత్తు చేస్తుంటారు. ఏడాదిగా ఈ పరికరాల నిర్వహణను మున్సిపల్ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా పరికరాల విడిభాగాలు పాడయి పనికిరాకుండా పోయాయి. ఇలాంటి పరిస్థితి సిరిసిల్ల పట్టణంలోని అన్ని ఓపెన్ జిమ్స్‌లలో ఉంది. శిథిలమైన ఓపెన్ జిమ్స్‌పై ‘సాక్షి’ ఫోకస్.



రిపేరుకు నోచుకోని ఇందిరాపార్కులోని స్మార్ట్ ఓపెన్‌జిమ్

‘స్మార్ట్ సిరిసిల్ల’పై పట్టింపేది?

టీడీఎంఏ(డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 23 ప్రాంతాల్లో ఓపెన్‌జిమ్స్‌ను ఏర్పాటు చేశారు. ‘వరల్డ్‌బ్యాంకు’ ప్రాజెక్టు ద్వారా ఇందిరాపార్కు, శాంతినగర్, గణేష్‌నగర్‌లలో ఒక్కోటి రూ.15లక్షలు వెచ్చించి రూ.45లక్షలతో స్మార్ట్‌జిమ్స్ ఏర్పాటు చేశారు. వీటితోపాటు సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానం, రగుడు, శాంతినగర్, నెహ్రూనగర్, కార్గిల్ లేక్, పెద్దూరు, చిన్నబోనాల, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, జేపీ నగర్‌పార్క్, పద్మనగర్, బీవై నగర్, సుందరయ్యనగర్, వెంకంపేట, నర్సింగ్ కాలేజీ, నెహ్రూపార్కు, డబుల్‌బెడ్ రూమ్ కాంప్లెక్స్, వెంకట్రావునగర్ పార్క్, సాయినగర్ ప్రాంతాల్లో ఓపెన్‌జిమ్స్ ఏర్పాటు చేశారు. కొన్ని నెలలుగా వీటి పర్యవేక్షణ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.1.75కోట్లతో ఏర్పాటు

స్మార్ట్ సిరిసిల్లలో ప్రజా ఆరోగ్యం కోసం రూ.1.75కోట్లు ఖర్చు చేశారు. గత మూడేళ్లుగా బల్దియా వాటి నిర్వహణపై శ్రద్ధ పెట్టడం లేదు. ఫలితంగా పరికరాలు విరిగిపోవడం, ఫ్లోరింగ్ పెచ్చులూడుతున్నాయి. ఆరోగ్య సిరిసిల్ల లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రెండు నెలలకోసారైనా మరమ్మతులు చేయించాల్సి ఉన్నా అధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

టెండర్లు పిలిచాం



ఓపెన్‌జిమ్స్ మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో మరమ్మతు పనులు చేపట్టలేకపోయాం. ఓపెన్‌జిమ్స్‌లో పరికరాలు పాడయ్యాయి. వాటిని వెంటనే రిపేరు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. ఎక్కడెక్కడ పరికరాలు పాడయిపోయాయో సిబ్బంది పరిశీలించి రిపేర్లు చేయించేలా చూస్తాం. అన్ని ఏరియాల్లో ఓపెన్ జిమ్స్‌లో ప్రజలు వ్యాయామం చేసుకునేలా సౌకర్యాలు కల్పిస్తాం.

– దుబ్బాక లావణ్య, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

‘కిలిమంజారో’ అధిరోహణ



కిలిమంజారో పర్వతంపై మహిపాల్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌కు చెందిన పర్వతారోహకుడు, ఎక్సైజ్ కానిస్టేబుల్ లెంకల మహిపాల్ రెడ్డి అరుదైన ఘనత సాధించారు. గతంలో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన ఆయన శుక్రవారం మరోసారి అదే పర్వతాన్ని అధిరోహించి, రికార్డు సృష్టించారు. ఈ నెల 16న కిలిమంజారో పర్వతారోహణను ప్రారంభించిన మహిపాల్‌రెడ్డి శుక్రవారం పూర్తి చేశారు. పర్వతంపై సే నో టు డ్రగ్స్ అనే బ్యానర్ ఆవిష్కరించారు. రెండోసారి మౌంట్ కిలిమంజారో అధిరోహణకు సహకరించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

గుకేశ్, హంపిలను కలిసిన ‘చెస్’ జిల్లా కార్యదర్శి


గుకేశ్‌కు జ్ఞాపిక ఇస్తున్న అనూప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: చెస్ ప్రపంచ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్న దొమ్మరాజు గుకేశ్, భారత చెస్ క్రీడాకారిణి కోనేరు హంపిలను కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్, కోచ్, ఇంటిగ్రేటెడ్ చెస్ జిల్లా కార్యదర్శి కంకటి అనూప్‌కుమార్ శుక్రవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని సత్కరించి, వేంకటేశ్వరస్వామి జ్ఞాపికలు అందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చెస్‌కు విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో చెస్ మెగా టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అనంతపల్లిలో చేపలు మృతి



బోయినపల్లి(చొప్పదండి): అనంతపల్లిలో మత్స్యకారులు పెంచుకుంటున్న చేపలు శుక్రవారం మృతిచెందాయి. చేపల మృతిపై మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని బందంకుంటలో గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపలు పెంచుతున్నారు. బందంకుంట వద్దకు శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా చేపలు చనిపోయి కనిపించాయి. వీటి విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని వారు తెలిపారు. బందంకుంటను జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య పరిశీలించారు. కుంటలోని మట్టి, నీరును టెస్టింగ్ కోసం హైదరాబాద్ పంపినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

చొప్పదండి: భూపాలపట్నంకు చెందిన నాంపల్లి సూరవ్వ అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనూష తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. సూరవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు మహేశ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

‘సీఎం కప్’లో.. టాప్ 10లో

- పతకాల పట్టికలో కరీంనగర్‌కు పదోస్థానం
- వరుసగా 28, 30, 31వ స్థానాల్లో నిలిచిన జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి
- రాష్ట్రస్థాయి జూడో పోటీల నిర్వహణతో కరీంనగర్‌కు పెరిగిన ఖ్యాతి

కరీంనగర్ స్పోర్ట్స్: సీఎం కప్–2024 క్రీడా పోటీలను ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించింది. డిసెంబర్ 7 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సుమారు 36 క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మెరికల్లాంటి క్రీడాకారులు ఎందరో వెలుగులోకి వచ్చారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తా చాటి, పలు పతకాలు సాధించారు. పతకాల పట్టికలో కరీంనగర్ 10వ స్థానంలో నిలవడం విశేషం. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలు వరుసగా 28, 30, 31వ స్థానాల్లో నిలిచాయి. అంతేకాకుండా, డిసెంబర్ 26 నుంచి 29 వరకు రాష్ట్రస్థాయి జూడో పోటీల నిర్వహణతో కరీంనగర్‌కు ఖ్యాతి పెరిగింది.


రజతం సాధించిన పారా వాలీబాల్ కరీంనగర్ పురుషుల జట్టు


కాంస్య పతకం గెలిచిన హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా పురుషుల జట్టు

కరీంనగర్.. 48 పతకాలు


సైక్లింగ్‌లో 2 బంగారు పతకాలు సాధించిన హృతికేశ్


జూడోలో బంగారు పతకం గెలిచిన కార్తీక్

సీఎం కప్ పోటీల్లో కరీంనగర్ జిల్లా క్రీడాకారులు 10 బంగారు పతకాలతో కలిపి మొత్తం 48 పతకాలను సాధించారు. టీం విభాగంలో ఉమ్మడి జిల్లా నుంచి పోటీ పడిన బాలుర జట్టు అద్వితీయ ప్రతిభతో కాంస్య పతకం గెలుచుకుంది. అథ్లెటిక్స్‌లో 2 బంగారు, 3 రజత, 1 కాంస్య, సైక్లింగ్‌లో 2 బంగారు, జూడోలో 1 బంగారు, 3 రజత, 1 కాంస్య, కరాటేలో 1 బంగారు, 1 కాంస్య, పారా అథ్లెటిక్స్‌లో 1 బంగారు, 1 రజత, 1 కాంస్య, పవర్ లిఫ్టింగ్‌లో 1 బంగారు, 1 రజత, స్విమ్మింగ్‌లో 1 బంగారు, 2 రజత, 1 కాంస్య, యోగాలో 1 బంగారు, 2 రజత, 1 కాంస్య, జిమ్నాస్టిక్స్, కిక్ బాక్సింగ్, పారా వాలీబాల్‌లలో ఒక్కో రజత, బాక్సింగ్‌లో 1 రజత, 4 కాంస్య, బ్యాడ్మింటన్‌లో 1 కాంస్య, చెస్‌లో 1 కాంస్య, తైక్వాండోలో 1 రజత, 1 కాంస్య, రెజ్లింగ్‌లో 1 రజత, 2 కాంస్య, వుషులో 3 రజత, 2 కాంస్య పతకాలను క్రీడాకారులు కైవసం చేసుకున్నారు.

జగిత్యాల.. 18


పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణం గెలిచిన స్వప్నిక


యోగాలో స్వర్ణం సాధించిన మిక్విత్

జగిత్యాల జిల్లా క్రీడాకారులు 18 పతకాలు సాధించారు. పవర్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ క్రీడాకారిణి విరించి స్వప్నిక, యోగాలో మిక్విత్ బంగారు పతకాలు సాధించారు. పవర్ లిఫ్టింగ్‌లో 1 బంగారు, 2 రజత, 4 కాంస్య, యోగాలో 1 బంగారు, 1 కాంస్య, బాక్సింగ్‌లో 1 రజత, 2 కాంస్య, కరాటేలో 1 రజత, పారా బ్యాడ్మింటన్‌లో 1 రజత, కిక్ బాక్సింగ్‌లో 4 కాంస్య పతకాలు సాధించారు.

రాజన్న సిరిసిల్ల.. 13

రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడాకారులు 13 పతకాలను సాధించారు. కిక్ బాక్సింగ్‌లో ఎండీ.అయాన్ బంగారు పతకంతో మెరిశాడు. ఇందులోనే 1 కాంస్య, అథ్లెటిక్స్‌లో 2 రజత, 1 కాంస్య, వుషులో 1 రజత, 4 కాంస్య, యోగాలో 2 రజత, జూడోలో 1 కాంస్య పతకాలు వచ్చాయి.


వుషు పోటీల్లో 5 పతకాలు సాధించిన రాజన్నసిరిసిల్ల క్రీడాకారులు

పెద్దపల్లి.. 11


వుషులో స్వర్ణం గెలిచిన శ్రావ్యాంజలి

పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు 11 పతకాలు సాధించారు. వుషులో 60 కేజీలలోపు విభాగంలో ఎస్.శ్రావ్యాంజలి బంగారు పతకం సాధించింది. ఇందులోనే 3 కాంస్య, జూడో, కరాటే, కిక్ బాక్సింగ్‌లలో ఒక్కో రజత, అథ్లెటిక్స్, బాక్సింగ్, పవర్ లిఫ్టింగ్, రెజ్లింగ్‌లలో ఒక్కో కాంస్య పతకాలు గెలిచారు.

టాప్-3లో నిలవడమే లక్ష్యం



జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శన ఇచ్చారు. 18 క్రీడాంశాల్లో పతకాలు సాధించడం విశేషం. వచ్చే సంవత్సరం జరిగే సీఎం కప్ పోటీల్లో టాప్–3లో నిలవడమే లక్ష్యం. ఇందుకోసం ఇప్పటినుంచే సమాయత్తమవుతాం.

– వి.శ్రీనివాస్ గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

అట్టహాసంగా నిర్వహించాం



జూడో పోటీలను కరీంనగర్‌లో అట్టహాసంగా నిర్వహించాం. ఈ పోటీలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూడోకు క్రేజ్ వచ్చింది. ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులే 7 పతకాలు కైవసం చేసుకోవడం శుభపరిణామం.

– గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, తెలంగాణ జూడో సంఘం ప్రధాన కార్యదర్శి

భవిష్యత్‌లో మరిన్ని పతకాలు



వుషు క్రీడలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు అత్యధికంగా 14 పతకాలు సాధించారు. చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించే దిశగా క్రీడాకారులను తీర్చిదిద్దుతాం.

– బార విద్యాసాగర్, వుషు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

హ్యాండ్‌బాల్‌కు ఆదరణ



జట్టు విభాగంలో ఉమ్మడి జిల్లా తరఫున హ్యాండ్‌బాల్ క్రీడలో మాత్రమే ఫలితాలు అనుకూలంగా రావడం విశేషం. బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచి, ఈ క్రీడకు ఆదరణ తీసుకొచ్చింది.

– బసవేణి లక్ష్మణ్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- మూడు వాహనాలు స్వాధీనం


అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం: బైక్ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన గుర్రం శరత్‌కుమార్ బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం స్థానిక చిన్న కెనాల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో జగిత్యాల చిలుకవాడలో ఉంటున్న కోరుట్ల గంగంపేటకు చెందిన ఎండీ.అమీర్ నంబర్ ప్లేట్ లేని వాహనంపై వచ్చాడు. అతని వద్ద ఎటువంటి వాహన పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో 2024 అక్టోబర్ 20న జగిత్యాల కొత్త బస్టాండ్ నుంచి కరీంనగర్ వెళ్లే దారిలో ఒక బైక్, 2024 డిసెంబర్ 18న అశోక్‌నగర్‌లోని ఓ ఆస్పత్రి ఎదుట మరో బైక్‌ను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు మొత్తం మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మదరావు, గీత, కానిస్టేబుళ్లు జీవన్, అనిల్ పాల్గొన్నారు.

డబ్బులు, ఫోన్ లాక్కెళ్లిన ఇద్దరి రిమాండ్

ఓ వ్యక్తిని బెదిరించి, డబ్బులు, ఫోన్ లాక్కెళ్లిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన దుర్గం సాయిబాబా కొంతకాలంగా జగిత్యాల బైపాస్ రోడ్‌లోని గోవిందుపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16న పని నిమిత్తం బయటకు వెళ్లి, తిరిగి వస్తున్నాడు. రాత్రి 10.30 గంటల సమయంలో గోవిందుపల్లి వద్ద గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి, అతన్ని అడ్డగించారు. చంపుతామని బెదిరించి, రూ.2,800, సెల్‌ఫోన్ లాక్కొని, పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు జగిత్యాల పురాణిపేటకు చెందిన పోచంపల్లి శంకర్, జగిత్యాల రూరల్ మండలం బాలపల్లికి చెందిన సిరికొండ నరేశ్‌లుగా గుర్తించారు. శుక్రవారం జగిత్యాల మంచినీళ్ల బావి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరూ పట్టుబడ్డారని డీఎస్పీ పేర్కొన్నారు. నగదు, ఫోన్, బైక్ స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో నిందితులను అరెస్టు చేసిన పట్టణ పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మదరావు, గీత పాల్గొన్నారు.

ఉత్సాహంగా తెప్పల పోటీలు

- మూడేళ్లుగా సంక్రాంతి సందర్భంగా మిడ్‌మానేరులో నిర్వహణ
- తరలివచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు
- జిల్లాస్థాయిలో నిర్వహణకు ఏర్పాట్లు చేయండి : విప్ ఆది శ్రీనివాస్



తెప్పల పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు, విజేతకు కప్ అందిస్తున్న విప్ శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ అర్బన్: వేములవాడ మండలంలో సంక్రాంతి అంటే గుర్తొచ్చేది తెప్పల పోటీలు. ఈ ప్రాంత ముదిరాజ్ మత్స్యకారులు ప్రతీరోజు మిడ్ మానేరు ప్రాజెక్టులో చేపలు పడుతుంటారు. మూడేళ్లుగా నిర్వహిస్తున్న తెప్పల పోటీలను శుక్రవారం ఉత్సాహంగా జరిపారు.

సుమారు 2 కి.మీ. వెళ్లి..

వేములవాడ మండలంలోని రుద్రవరం పాత గ్రామం మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో రుద్రవరం ముదిరాజ్ మత్స్యకారుల ఆధ్వర్యంలో తెప్పల పోటీలు నిర్వహించారు. మానేరు ఒడ్డు నుంచి తెప్పలపై సుమారు 2 కిలోమీటర్లు వెళ్లి, అక్కడ నీటిలో ఏర్పాటు చేసిన జెండాను తీసుకొని ముందుగా వచ్చినవారే విజేతలు. ఈ పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పోటీపడిన 42 మంది..

వేములవాడ, నాంపల్లి, రుద్రవరం, సంకెపల్లి, అనుపురం, చింతాల్‌ఠాణ, చీర్లవంచ గ్రామాలకు చెందిన మత్స్యకారులు తెప్పల పోటీల్లో పాల్గొన్నారు. గ్రామానికి ఆరుగురి చొప్పున మొత్తం 42 మంది పోటీ పడ్డారు. మొదటి బ్యాచ్‌లో 22 మంది, రెండో బ్యాచ్‌లో 20 మంది ఉన్నారు. మొదటి బ్యాచ్‌లో గెలిచిన ముగ్గురు, రెండో బ్యాచ్‌లో గెలిచిన ముగ్గురికి మళ్లీ పోటీ నిర్వహించారు. వీరిలో ముగ్గురికి మొదటి, రెండో, మూడో బహుమతి అందించారు.

విజేతలు వీరే..

విజేతలుగా నిలిచిన రుద్రవరం గ్రామానికి తునికి రఘు(ప్రథమ స్థానం)కు రూ.10,116, కప్, నాంపల్లికి చెందిన కూన కుమార్(ద్వితీయ)కు రూ.5,116, కప్, పంగుడ వంశీ(తృతీయ) రూ.3,116, కప్ గెలుచుకున్నారు. వీరిని మత్స్యకారులు సన్మానించారు.

పోటీలు నిర్వహించడం గర్వకారణం..

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మన ప్రాంతంలోని మిడ్ మానేరులో సంక్రాంతికి తెప్పల పోటీలు నిర్వహించడం గర్వకారణమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. విజేతలకు ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి, బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెప్పల పోటీలను ప్రభుత్వం తరఫున నిర్వహించామని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని, కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముంపు గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి ఏలోకి మార్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేగులపాటి పాపారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, నాయకులు పిల్లి కనకయ్య, గాలిపెల్లి స్వామి, రాంరెడ్డి, కత్తి కనకయ్య, మల్లేశం, తునికి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



మానేరు నీటిలో తెప్పల పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఈ సంవత్సరం కూడా నేనే మొదటి బహుమతి గెలుచుకున్న. చెప్పలేని ఆనందం కలుగుతోంది.

– తునికి రఘు, రుద్రవరం

ప్రతీరోజు చేపల వేట



చిన్నప్పటి నుంచే చెరువులో చేపలు పట్టడం అలవాటైంది. ఇప్పుడు మిడ్‌మానేరు ప్రాజెక్టులో ప్రతీరోజు చేపల వేటకు వెళ్తున్న. తెప్పల పోటీలో రెండో బహుమతి గెలిచాను.

– కూన కుమార్, నాంపల్లి

మూడో బహుమతి గెలిచా



సంక్రాంతి పండుగ వస్తుందంటే మిడ్ మానేరులో తెప్పల పోటీలపై చర్చించుకుంటాం. పోటీలు సంబురంగా సాగుతాయి. నేను మూడో బహుమతి గెలిచాను.

– పండుగ వంశీ, రుద్రవరం

మూడోసారి పోటీలు..



తెప్పల పోటీలు నిర్వహించడం ఇది మూడోసారి. మత్స్యకారులకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో వలలు, తెప్పలు, గూడ్స్ వాహనాలు, ద్విచక్ర వాహనాలు అందించాలి.

– తునికి నరేశ్, తెప్పల పోటీల వ్యవస్థాపక అధ్యక్షుడు

అంధకారంలో సిరిసిల్ల బల్దియా

- బిల్లు చెల్లించలేదని పవర్ కట్
- సెస్ అధికారుల చర్యతో షాక్
- రాత్రి పునరుద్ధరణ


చీకటిలో పని చేస్తున్న అధికారి

సిరిసిల్లటౌన్: కరెంటు బిల్లులు చెల్లించలేదంటూ సిరిసిల్ల సెస్ అధికారులు బల్దియాకు షాక్ ఇచ్చారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన విద్యుత్ సర్వీసులు తొలగించారు. మున్సిపాలిటీ రూ.4.60 కోట్ల విద్యుత్ బిల్లులు సెస్‌కు బకాయి పడింది. చెల్లించాలని డిసెంబర్ నుంచి రెండు పర్యాయాలు నోటీసులు అందించారు. బిల్లుల చెల్లింపులో స్పందన లేకపోవడంతో శుక్రవారం సెస్ ఎండీ విజయేందర్‌రెడ్డి ఆదేశాలతో సిబ్బంది బల్దియాకు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో అధికారులు చీకట్లోనే సేవలందించారు. త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని సెస్ అధికారులతో మున్సిపల్ అధికారులు మాట్లాడగా..రాత్రి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు కమిషనర్ లావణ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

- ఘటనకు కారణమైన వ్యక్తిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): ఓ బైక్ మరో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన మైస అభిషేక్ శుక్రవారం బైక్‌ను అజాగ్రత్తగా నడుపుతూ.. రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఈదునూరి కుమారస్వామి, సుమలత, ముక్కెర సుగుణమ్మ, రాజకొమురయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు సుగుణమ్మ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన అభిషేక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు : ఆర్‌ఎంపీ దుర్మరణం

కొత్తపల్లి(కరీంనగర్): రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్‌ఎంపీ మృతిచెందినట్లు కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంటకు చెందిన ఓరుగంటి రామచంద్రం(63) కొన్నేళ్లుగా కొత్తపల్లి మండలంలోని బావుపేటలో ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం బావుపేట నుంచి కారులో కరీంనగర్ వెళ్తున్నాడు. చింతకుంట శివారులో ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్తంభం విరిగి, కారుపై పడటంతో రామచంద్రం తలకు బలమైన గాయాలై, మృతిచెందాడు. మృతుడి కుమారుడు డేవిడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసిన అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కోడె మొక్కు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

రాజన్న ఆలయంలో శనివారం నుంచి త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. అభిషేకం టికెట్లు ఈనెల 18 నుంచి 22 వరకు ఉదయం 8.30 గంటల తర్వాత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల్లో అభిషేకాలు రద్దు చేయనున్నట్లు తెలిపారు.

శివదీక్షలు ప్రారంభం

రాజన్న క్షేత్రంలో శుక్రవారం శివదీక్షలు ప్రారంభమయ్యాయి. అభిషేక మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు, గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తులు శివమాలలు ధరించారు. శివదీక్ష చేపట్టిన స్వాములు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మాల విరమణ చేయనున్నారు. ఆలయ అర్చకులు నందగిరి భానుశర్మ, శంకరయ్యశర్మ, గురుస్వామి వాసాలమర్రి గోపి తదితరులు ఉన్నారు.

తహసీల్ ఆఫీస్‌పై దాడి కేసులో 11 మందికి జైలు

కోనరావుపేట(వేములవాడ): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంపై దాడిచేసిన వారికి జైలుశిక్ష విధించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. 2017, మార్చి 19న కోనరావుపేట తహశీల్దార్ కార్యాలయంపై నిమ్మపల్లికి చెందిన జవ్వాజి విమల, డీలర్ చంద్రకళ, మ్యాదరి దేవయ్య, బండ రాజయ్య, బండ సత్తయ్య, పూజం రాజయ్య, గంగాధర్, పూజం లింగయ్య, రెడ్డిమల్ల లచ్చయ్య, మ్యాదరి మధు, జవ్వాజి గంగాధర్ దాడి చేశారు. ఈ ఘటనపై అప్పటి తహసీల్దార్ నాగరాజమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం జవ్వాజి విమలతోపాటు మరో 10 మంది నిందితులకు ఏడాది జైలు, రూ.3వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పు చెప్పారు. నిందితులు జిల్లా కోర్టులో అప్పీల్ చేయగా జిల్లా న్యాయమూర్తి వారి అప్పీల్‌ను తిరస్కరిస్తూ ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.